క్లుప్తంగా

'ఆక్సిజన్' సేవలకు చిరు సత్కారాలు

అమలాపురం టౌన్: కరోనా సమయంలో అమలాపురంలో సేవలందించిన చిరంజీవి ఆక్సిజన్ బ్యాంక్ ప్రతినిధులను అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు సోమవారం ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లోని చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌లో తమకు సత్కారాలు జరిగినట్లు అమలాపురానికి చెందిన రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు యేడిద శ్రీను తెలిపారు.

116 మద్యం బాటిళ్ల స్వాధీనం

అమలాపురం టౌన్: అమలాపురం బైపాస్ రోడ్డు, వై జంక్షన్ ప్రాంతాల్లో పోలీసులు వాహనాలు తనఖీ చేస్తున్న సమయంలో మోటారు సైకిల్‌పై అక్రమ మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపారు. అల్లవరం మండలం దేవగుప్తానికి చెందిన చిట్టూరి రామకృష్ణను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 116 మద్యం బాటిళ్లు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టణ సీఐ టి.క్రాంతికుమార్, పట్టణ ఎస్ఐ కె.మనోహర్ జోషి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండు విధించారన్నారు.

ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించారంటూ ఫిర్యాదు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లిలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించారంటూ తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎస్ఐ జి.వెంకటేశ్వరరావులకు గ్రామ పంచాయతీ కార్యదర్శి దాసరి కృష్ణాజీ ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉన్న ముక్కులమ్మ, ముత్యాలమ్మ ఆలయాల వద్ద ప్రభుత్వ ఆస్తిగా ఉన్న దశాబ్దాల నాటి పురాతన మంచినీటి బావిని కొందరు వ్యక్తులు ప్రొక్లెయినర్‌తో శిథిలం చేశారని, ప్రభుత్వ స్థలంలో ఉన్న కొబ్బరి చెట్లను అనధికారకంగా తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉత్సాహంగా బాలికల ఖోఖో పోటీలు

యానాం: జోనల్ గేమ్స్‌లో భాగంగా సోమవారం స్థానిక ఎంజీజీబీహెచ్ ప్రభుత్వ హైస్కూల్ క్రీడామైదానంలో అండర్-17 బాలికల ఖోఖో క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫైనల్స్‌లో పరంపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉన్నత పాఠశాల జట్టు విజేతగా నిలవగా, శ్రీ సాయి జూనియర్ కళాశాల ద్వితీయ స్థానాన్ని సాధించింది.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

అల్లవరం: గ్రామాల్లో చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని, డ్రెయిన్లలో పూడికను తొలగించి మురుగునీరు దిగువకు పారేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో పారిశుధ్యంపై కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. శీతాకాలం ప్రవేశంతో గ్రామాల్లో దోమలు బెడద ఎక్కువగా ఉంటుందని, వాటి నివారణకు ఫాగింగ్ చేయాలని సూచించారు. ఆడుదాం ఆంధ్ర, కులగణ సర్వే తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ ఎన్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శులు రాజా, రాజమోహన్, పి.శ్రీనివాస్, కేవీవీ సత్యనారాయణ, చిక్కం శ్రీను, దుర్గా శ్రీను పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పతకాలు

ముమ్మిడివరం: రామచంద్రాపురంలో జరిగిన 16వ కరాటే పోటీల్లో ముమ్మిడివరం యాపిల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. డి.సాయి హర్ష, జగతా మౌనికలు గోల్డ్ మెడల్ సాధించగా, డి.ధన కీర్తిక, డి.హన్సికలు సిల్వర్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన చిన్నారులను కరస్పాండెంట్ పుండరీష్, ప్రిన్సిపాల్ సత్యప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

కళ్లజోళ్ల పంపిణీ

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రు సచివాలయం-3 పరిధిలోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి చూపు సమస్య ఉన్న 110 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. సచివాలయం వద్ద సోమవారం సర్పంచ్ బీర సత్యకుమారి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతి రాజు, సొసైటీ అధ్యక్షుడు యిందుకూరి రంగరాజు, మాజీ జెడ్పీటీసీ కాశి పరివాజ్ కుమార్ తదితరులు ఈకళ్లజోళ్లను పంపిణీ చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: కోరంగిలో నిర్వహించనున్న మత్స్యకార భరోసా కార్యక్రమానికి సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. అనంతరం స్థానిక నాయకులతో సమావేశమై చేపట్టాల్సిన ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఇట్ల కిషోర్, మండల పార్టీ అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ పాల్గొన్నారు. మంగళవారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా కోరంగిలో నిర్వహించే కార్యక్రమంలో కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని వలంటీర్లకు సూచించారు.

రజక ఆత్మ గౌరవ సభ వాల్‌పోస్టర్ల విడుదల

అమలాపురం టౌన్: స్థానిక ఈదరపల్లిలోని సంఘ భవనంలో రజక ఆత్మ గౌరవ సభ వాల్‌పోస్టర్లను పట్టణ శాఖ అధ్యక్షుడు పేట ఏడుకొండలు సోమవారం విడుదల చేశారు.

ఆటుపోట్లలో బతుకు నావ

- జీవనోపాధి కోసం కెరటాలతో పోటీ
- నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం


సావిత్రినగర్ జెట్టీ వద్ద బోట్లు


చేపల వేట సాగిస్తున్న మత్స్యకారుడు

యానాం: మత్స్యకారుల జీవితాలు నిత్యం ఆటుపోట్ల నడుమ పోటెత్తే కెరటాలతో పోటీపడతాయి. జీవిత ప్రయాణంలో ఎన్నో తుఫానులు, అలజడులు ఎదురైనా మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్నాయి. పారిశ్రామిక కాలుష్యం, పెట్రోలియం కంపెనీల కార్యకలాపాల రూపంలో వీరి జీవనోపాధికి విఘాతం కలుగుతుంది. క్రమంగా మత్స్య సంపద తగ్గిపోతుండటంతో ఎటువెళ్లాలో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న మత్స్యకారులను ప్రభుత్వం స్పందించి ఆదుకోవడం ఊరట కలిగిస్తుంది. మత్స్యకారులంతా ఏటా నవంబర్ 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని నిర్వహించుకుంటారు. ఐక్యరాజ్యసమితి అధ్యయనం ప్రకారం జాలర్లు క్రమంగా తమ సాంప్రదాయ వృత్తి నుంచి దూరవుతున్నారు. యాంత్రీకరణ, ఓవర్ ఫిషింగ్, పారిశ్రామిక కాలుష్యాలు సముద్ర జలాల్లోకి వదిలేయడమే దీనికి ప్రధాన కారణమని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. యానాం నియోజకవర్గంతో పాటు ముమ్మిడివరం నియోజవకర్గ పరిధిలోని తాళ్లరేవు, కాట్రేనికోన, ఐ.పోలవరం, ముమ్మిడివరంల్లో వేలాది కుటుంబాలు ఇప్పటికీ మత్స్య వేటనే నమ్ముకుని జీవనోపాధి సాగిస్తున్నాయి. అందుకే ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమం కోసం వేట విరామ సమయంలో నష్టపరిహారం అందజేస్తున్నాయి. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని మత్స్యకారుల కోసం చమురు సంస్థల నుంచి నష్టపరిహారం తెప్పించి ఇప్పిస్తుండడంపై మత్స్యకారులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయం

మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయంగా పుదుచ్చేరి ప్రభుత్వం విశేష కృషి చేస్తుంది. వేట విరామ సమయంలో నష్టపరిహారం పంపిణీ చేస్తున్నాం. వేటలో ప్రమాదవశాత్తూ మృతిచెందిన వారికి పరిహారం ఇస్తున్నాం. ఓఎన్‌జీసీ నష్ట పరిహారం పంపిణీకి అన్నివిధాలా చర్యలు తీసుకున్నాం.

– గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎమ్మెల్యే, యానాం

రాయితీపై బోట్లు మంజూరు చేయాలి

మత్స్యకారులకు ప్రభుత్వం రాయితీపై బోట్లు, వలలను మంజూరుచేయాలి. ప్రస్తుతం బోట్లు, నావలు కొనుగోలు చేయాలంటే లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుంది. అందుకే మత్స్యకార కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరుతున్నాం.

– మోదె హరిశ్చంద్ర, సావిత్రి నగర్

సంక్షేమ పథకాలే పేదలకు అండ

ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు

అమలాపురం టౌన్: జగన్ ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే పేదలకు ఆర్థికంగా అండగా మారాయని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక సూర్యనగర్ వార్డు సచివాలయం వద్ద సోమవారం జరిగిన 'ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్థానిక హైస్కూలు సెంటరులో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అక్కడ నుంచి వార్డు సచివాలయానికి పాదయాత్రగా వెళ్లి సభ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, నాగారపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి సీఎం జగన్ అవసరం

అల్లవరం: కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమాన్ని అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ఎంతో అవసరమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. దేవగుప్తం సచివాలయం ఆవరణంలో ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఈ ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. అనంతరం సంక్షేమ బోర్డుని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ సాధనాల వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ ఈతకోట సతీష్ తదితరులు పాల్గొన్నారు.


జి.వేమవరంలో పథకాల లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నాయకులు

అమలాపురం రూరల్: నాలుగున్నరేళ్లుగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి లబ్ధిదారుడుకి నేరుగా సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ అన్నారు. భట్నవిల్లి సచివాలయంలో ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం సంక్షేమ బోర్డు, వైఎస్సార్ సీపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుకోటి సూజాత, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, డీసీసీడీ డైరెక్టర్ యిళ్ల గోపాలకృష్ణ, ఈవోపీఆర్డీ జి.మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్


అమలాపురంలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

జగనన్న పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

తాళ్లరేవు: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే రావాలని వైఎస్సార్ సీపీ మండల సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్ అన్నారు. సోమవారం జి.వేమవరం సచివాలయం-2 వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం పథకాల లబ్ధిని వివరించే ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యర్రంనీడి అప్పారావు, గ్రామ ఉపసర్పంచ్ మట్టా లింగమూర్తి, ఈఓపీఆర్‌డి మల్లాడి భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హర హర మహాదేవ


అమలాపురం రామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు


వీరేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

ఐ.పోలవరం: కార్తిక మాసం మొదటి సోమవారం కావడంతో మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తొలి పంచామృత అభిషేకాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు, లలితా పారాయణం చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు ఏర్పాట్లు చేశారు. సుమారు 5 వేల మంది స్వామిని దర్శించుకున్నారని ఆలయ కమిటీ తెలిపింది. ఆలయానికి వచ్చిన భక్తులకు చెయ్యేరు గ్రామానికి చెందిన చవటపల్లి నాగేంద్రరావు, అనంతలక్ష్మి దంపతులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

అమలాపురం టౌన్: పట్టణంలోని చెన్నమల్లేశ్వరస్వామి, సిద్దేశ్వరసామి, చంద్రమౌళీశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, నాగ లింగేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచే శివునికి అభిషేకాలు మొదలయ్యాయి. పురాతన శివ క్షేత్రమైన చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో వందలాది మంది భక్తులు అభిషేకాలు చేశారు. ఆలయ చైర్మన్ కల్వకొలను బాబి, ఈఓ సత్యనారాయణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అనువంశిక చైర్మన్ మాచిరాజు రవికుమార్ ఆధ్వర్యంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి.

ముమ్మిడివరం: ముమ్మిడివరంలోని ఉమా వల్లభేశ్వరస్వామి ఆలయం, అయినాపురం, అనాతవరం, తానేలంక, కొత్తలంక, సీహెచ్ గున్నేపల్లి, కొమానపల్లి, అన్నంపల్లి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

అమలాపురం టౌన్: ఎవరైనా ఇంటికి తాళాలు వేసి ఊరికి లేదా యాత్రకు వెళ్లాలనుకుంటే ఆ ఇంటి యాజమానులు లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలని పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ సూచించారు. స్థానిక కల్వకొలను వీధి, వంటెద్దు వీధుల్లోని 2, 3 వార్డు సచివాలయాల్లో కార్యదర్శులు, స్థానిక ప్రజలతో ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యంపై సోమవారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఊర్లో ముందు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్‌హెచ్‌ఎంఎస్ దరఖాస్తును పూర్తి చేసి అందజేస్తే పోలీసులు ఆ ఇంటికి వచ్చి సీసీ కెమెరాలు బిగిస్తారన్నారు. సదరు ఇంటిలో ఎవరైనా చోరీకి యత్నిస్తే పోలీస్‌స్టేషన్ నుంచి నిర్వహించే మోనిటరింగ్ ద్వారా గుర్తించి దొంగతనాలను అడ్డుకుంటామన్నారు. స్మార్ట్ ఫోన్లలో అనవసర లింక్‌లు, ఓటీపీల జోలికి పోవద్దని హితవు పలికారు. అవగాహన సదస్సుల్లో తోట శ్రీను, ఎస్ఐ రాజేష్‌కుమార్, బండి వీరన్న, కె.వెంకట కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ క్రాంతికుమార్

దత్తమణికంఠ సన్నిధిలో ఎమ్మెల్యే పొన్నాడ

యానాం: గౌతమీగోదావరి తీరంలో కొలువైన శ్రీదత్త మణికంఠ స్వామివారి ఆలయానికి సోమవారం ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ విచ్చేసి స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పలువురు అయ్యప్ప స్వామిమాలధారులు ఎమ్మెల్యే పొన్నాడకు సాదర స్వాగతం పలికారు. స్వాముల అన్నదానం నిమిత్తం రూ.10 వేలు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో స్వాములు ఆకుల నాగేశ్వరరావు, చెక్కా నూకరాజు, ఆకుల మార్కేండేయులు, బర్రే మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


దత్తమణికంఠ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుంది


ఉప్పలగుప్తంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంసదరావు


బహుమతులు అందుకున్న విద్యార్థులతో మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి


అల్లవరంలో బహుమతులు పొందిన విద్యార్థులతో ఎంపీపీ శేషగిరిరావు తదితరులు

ఉప్పలగుప్తం: పుస్తక పఠనం అలవరుచుకుంటే విజ్ఞానం పెరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని భీమనపల్లి, ఉప్పలగుప్తం శాఖా గ్రంథాలయాల్లో 56వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం గ్రంథాలయాధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషుకుమార్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, ఎంపీటీసీ సభ్యులు దేశంశెట్టి నాగరత్నకుమారి, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, సత్తి సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

అమలాపురం టౌన్: స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముంగింపు సభకు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఆమె బహుమతులు అందజేశారు. విద్యార్థులు గ్రంథాలయాలను విరివిగా ఉపయోగించుకుని పుస్తక పఠనంపై మరింత ఆసక్తి పెంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు, గ్రంథాలయాధికారి పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: అల్లవరం గ్రంథాలయంలో వారం రోజులుగా జరిగిన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. గ్రంథాలయాధికారి ద్వారకమణి ఆధ్వర్యంలో జరిగిన వారోత్సవాలకు ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి ముఖ్యఅతిథులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, పేపర్ రీడింగ్ తదితర పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపినవారికి ఎంపీపీ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్.మౌనిక, ఎంపీడీఓ కృష్ణమోహన్, ఏజీఎస్ ప్రకాష్‌రావు, స్వామి శ్రీనివాస్, డి.రుక్మిణి పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

కాట్రేనికోన: వ్యవసాయ పరపతి సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. కందికుప్ప వ్యవసాయ పరపతి సంఘం వద్ద సోమవారం 70వ సహకార వారోత్సవాలు ముగింపు సమావేశానికి ఎమ్మెల్యే పొన్నాడ విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకారం సంఘాలు సన్న, చిన్నకారు రైతులకు సకాలంలో రుణాలు అందించి సహకరిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యేను కందికుప్ప పీఏసీఎస్ అధ్యక్షుడు ఏడిది సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీబి చైర్మన్ ఆకుల వీర్రాజు, సెంట్రల్ డెల్టా చైర్మన్ ఏడిది చక్రపాణిరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏడిద సుబ్బారావు, జెడ్పీటీసీ నేల కిషోర్, వైస్ ఎంపీపీ ఏడిది అరుణ, సర్పంచ్ చల్లగల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పొన్నాడకు అయ్యప్ప స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఏడిద సుబ్బారావు

పశు విజ్ఞాన బడిపై అవగాహన సదస్సు

అల్లవరం: మండలంలోని డి.రావులపాలెంలో సహాయ సంచాలకులు విజయారెడ్డి ఆధ్వర్యంలో పశు విజ్ఞాన బడిపై పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పశువుల్లో అధిక పాల ఉత్పత్తిని సాధించాలంటే పాడి పశువుల పట్ల శుభ్రత పాటించాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటరావు సూచించారు. ఒక పశువుకి పాలు పితికిన తర్వాత మరో పశువుకి పాలు పితికే ముందు తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలన్నారు. పశువుకు అధిక పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తే అధిక పాల ఉత్పత్తి సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శివరామకృష్ణ, పశు సహాయకులు శివ నాగేంద్ర, పాడి రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా చైతన్య కల్యాణ్


నూతన ఎంపీడీఓ చైతన్య కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యాలయ సిబ్బంది

ఐ.పోలవరం: మండల ఎంపీడీఓగా టి.చైతన్య కల్యాణ్ జై భరత్‌రాజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గ్రూప్-1 ద్వారా ఎంపికై మొదటిసారిగా ఇక్కడ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చైతన్య కల్యాణ్ చెప్పారు.

పూడిక తీత పనుల ప్రారంభం

ఐ.పోలవరం: మురమళ్ల నుంచి ఎదుర్లంక వరకూ పంట కాలువలో పూడిక తీత పనులను సోమవారం ప్రారంభించారు. శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదని కలెక్టర్ హిమాన్షుశుక్లాను రైతు సంఘాల నాయకులు కలిసి మొరపెట్టుకున్నారు. దీంతో కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. సోమవారం జేసీబీతో పూడికతీత పనులను రైతు సంఘాల నాయకులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఇరిగేషన్ డీఈ పి.శ్రీనివాసరావు, ఏఈ శివరామకృష్ణ పనులను పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముదునూరి సతీష్ రాజు, సర్పంచ్ కాశే రాజుబాబు, రైతు సంఘ నాయకులు కె.నరసింహమూర్తి, రాచకొండ మాణిక్యాలరావు, సాగి వెంకటపతిరాజు, వేగేశ్న సూర్యనారాయణరాజు, ఢిల్లీ నారాయణ, పిన్నంరాజు వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల కోసం పలు చట్టాలు



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రెహంతుల్లా

ముమ్మిడివరం: బాలల హక్కుల పరిరక్షణ కోసం పలు చట్టాలు రూపొందించారని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహమ్మద్ రెహంతుల్లా పేర్కొన్నారు. మండలంలోని తానేలంక జెడ్పీ పాఠశాలలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బాలలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడానికి ఫోక్సో చట్టం తీసుకొచ్చారన్నారు. అనంతరం బాలలకు కల్పించిన పలు హక్కులను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్‌వీ ప్రసాద్, ఆర్.మణేశ్వరావు, డి.సత్యనారాయణ, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌కు ఆర్థిక సాయం

అమలాపురం టౌన్: వచ్చే నెల 10వ తేదీ నుంచి మలేషియాలో జరగనున్న ఏషియన్ ఓపెన్ అండ్ మాస్టర్ క్లాసిక్ సబ్ జూనియర్ ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్న అమలాపురానికి చెందిన పిల్లి వందనకు గుడ్ సీడ్ ఫౌండేషన్ రూ.25 వేలు ఆర్థిక సాయం సమకూర్చింది. బీటెక్ చదువుతున్న వందన మలేషియా దేశం వెళ్లేందుకు స్థానిక ఫౌండేషన్ కార్యాలయంలో ఈ మొత్తాన్ని ఫౌండేషన్ చైర్మన్ కుంచే రమణారావు, సునీత దంపతుల చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పచ్చిమాల బాబ్జి, గంటా లక్ష్మీ ప్రసాద్, నేరేడుమిల్లి శ్రీను, కుంచే అర్జున్, పరమట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ అలవరచుకోవాలి

యానాం: వృత్తి పరంగా సామర్థ్యాలను సాధించాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ అలవరచుకోవలని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమినార్‌లను, వర్క్‌షాప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, రూసా కోఆర్డినేటర్ డాక్టర్ జేవీ సుధాకర్, డాక్టర్ వి.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి భూమి పూజ

తాళ్లరేవు: మండలంలోని నీలపల్లిలో శ్రీమహాలక్ష్మమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ ఘనంగా నిర్వహించారు. వందల ఏళ్ల నాటి ఆలయం శిథిల స్థితికి చేరుకోవడంతో గ్రామస్తులు, భక్తుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణం చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టూరి నాగమణి, చెక్కా నూకరాజు, అరదాడి దుర్గారావు, దుర్గ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.